www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 06 వెల : రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 143 | మంగళవారం | 05.11.2024

# ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రావొద్దు

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలి

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేకాధికారుల నియామకం

8న మూసీ వెంట సీఎం పాదయాత్ర

స్టూడెంట్స్ పార్టీల నేతల మాటలు నమ్మొద్దు

విద్యార్థులతో సీఎం ఇష్టాగోష్టి



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు రాకుండా, సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. 'కొనుగోళ్ల ప్రక్రియ ఎలా కొనసాగుతోంది? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా?' అని ఆరా తీశారు. కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. ఏమైనా సమస్యలు తలెత్తితే

మిగతా 2లో..

# ఏడాది పాలనలో పదేళ్ల విధ్వంసం

గాంధీ భవన్‌కు కాదు..

ప్రజల దగ్గరకు రాహుల్ వచ్చే దమ్ముందా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

ప్రజలను మోసం చేసినందుకు సారీ చెప్పి తెలంగాణకు రా

హింసించే పులకేశిలా సీఎం రేవంత్ తయారైండు

బ్లాక్‌మెయిల్ రేవంత్‌తో రాష్ట్రం పదేళ్లు వెనక్కి

మీ చిత్రగుప్తుడి చిట్టా అంతా ఉంది

పోలీసులను పోలీసులతోనే కొట్టించిన ఘనత మీకే

ఏడాదిలోనే అన్ని వర్గాలను రోడ్డెక్కించారు

జవాబు చెప్తావా ఢిల్లీ బాబు అంటూ రాహుల్ గాంధీకి లేఖ

**ప్రజానావ, ఖైరతాబాద్:**

రాష్ట్రంలోకి అడుగుపెట్టకముందే తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలంటూ కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మాజీ మంత్రి కేటీఆర్ లేఖ రాశారు. ఆ లేఖలో పది నెలల్లో రేవంత్ రెడ్డి చేసిన విధ్వంసం..

మిగతా 2లో..



# ప్రేమించడం లేదని యువతిపై కత్తితో దాడి



మెదక్ లో ప్రేమోన్మాది ఘాతుకం

యువతిని ఆస్పత్రికి తరలింపు

నిందితుడు బెంగళూరుకు చెందిన చేతన్‌గా గుర్తింపు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

05



# మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

పెండింగ్ బిల్లులు రిలీజ్ చేయాలని పోరుబాట

సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నం

వారిని అడ్డుకున్న పోలీసులు.. మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నేతలు

పీఎస్ ఎదుట, రోడ్డుపై బైఠాయించి నిరసన

పుస్తెలు అమ్మి, అప్పులు తెచ్చి పనులు చేశారు: హరీశ్ రావు

బిల్లులన్నీ చెల్లిస్తమన్న కాంగ్రెస్ మాట తప్పింది: బండి సంజయ్

సర్పంచ్‌లకు మార్చిలోగా బకాయిలు చెల్లిస్తాం: మంత్రి పొన్నం

05

# ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టిపెట్టాలి

ప్రజలపై భారం పడకుండా చూడాలి

అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు

ఆదాయ వనరుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టిపెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జాయింట్ వెంచర్లలో వివాదాలు పరిష్కరించి ఆదాయం పెంచాలన్నారు. దీని కోసం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు

మిగతా 2లో..

# గరిష్ఠ ధరకు పంటను విక్రయించుకోవాలి

ఒక్కరోజే 3400 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజానావ, హైదరాబాద్:**

తెలంగాణలో పత్తి సేకరణ ప్రక్రియ వేగవంతమవుతోంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సీసీఐ అధికారులు 105 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఒక్క రోజే 1474 మంది రైతుల నుంచి 3400 టన్నుల పత్తి కొనుగోళ్లు జరిపినట్లు

మిగతా 2లో..






# ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులపై బీజేపీ కసరత్తు

మూడు స్థానాలపై కమలనాథుల కన్ను

ప్రైవేట్ విద్యాసంస్థల అధినేత వైపే పార్టీ మొగ్గు

02

# కులగణనకు డెడికేషన్ కమిషన్

చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ వెంకటేశ్వరరావు

సెక్రటరీగా ఐఎఫ్ఎస్ ఆఫీసర్ బీ సైదులు నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైకోర్టు ఆదేశాలతో కమిషన్ ఏర్పాటు

నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని సర్కార్ ఆర్డర్స్



**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు కులగణన కోసం డెడికేషన్ కమిషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ ఛైర్మన్‌గా

మిగతా 2లో..



# మూసీ మురికి ప్రజలను పీడిస్తుంది

ప్రతిపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

02



# నేడు రాష్ట్రానికి రాహుల్ గాంధీ

02



## ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టిపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం సమావేశమైంది. మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్థిక, పురపాలక, రెవెన్యూ, పరిశ్రమలు, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన పురపాలక, గృహనిర్మాణ, న్యాయశాఖల కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. సమస్యకు పరిష్కారం చూపేలా వారం రోజుల్లోగా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. తమకు ప్రోత్సాహకాలు అందిస్తే నగరం విడిచి ఔటర్ రింగ్ రోడ్డు బయటకు వెళ్తామని కాలుష్యకారక పరిశ్రమల నిర్వాహకులు మంత్రివర్గ ఉపసంఘానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో.. ఈ విజ్ఞప్తులు పరిశీలించి వారు ఓఆర్ఆర్ బయట పరిశ్రమలు స్థాపించుకునేలా సహకరించి, ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరంలో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



## గరిష్ఠ ధరకుపంటను విక్రయించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట చేతికొచ్చి మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో 1472 మంది రైతుల నుంచి 2724 టన్నుల పత్తి కొనుగోళ్లు జరిగాయి. నిన్న మంత్రి తుమ్మల సీసీఐ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీంతో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. క్షేత్రస్థాయిలో రైతులందరూ తమ పత్తి పంటను ప్రైవేట్ సంస్థలకు తక్కువ మద్దతు ధరకు విక్రయించి నష్టపోవద్దని మంత్రి సూచించారు. మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన వాట్సప్ యాప్ ద్వారా దగ్గరలో కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకొని, అక్కడ గరిష్ఠ మద్దతు ధరకు పంటను విక్రయించుకోవాలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రావొద్దు

(మొదటి పేజీ తరువాయి)



అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హైదరాబాద్ మినహా మిగతా 9 ఉమ్మడి జిల్లాలకు ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించిన సంగతి తెలిసిందే. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకొని రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**యాదాద్రిలో పూజలు.. పాదయాత్ర**

ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు చర్చించారు.

**భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం**

నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి.

**విద్యార్థులతో ముఖాముఖి..**

గత పదేళ్లలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామన్నారు. విద్యార్థులతో సీఎం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ''త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. యువజన సంఘాలు బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించేలా చొరవ చూపాలి. స్కూల్స్, కాలేజీల్లో డ్రాప్ అవుట్స్ సంఖ్య తగ్గాలి. ఇది యువతపై ఉన్న అతి పెద్ద బాధ్యత. యువతరం విద్యను నిర్లక్ష్యం చేయొద్దు. గంజాయి, డ్రగ్స్ లాంటివి పెను ప్రమాదకరం. అలాంటి వ్యసనాల బారిన పడొద్దు. విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి. కొన్ని రాజకీయ పార్టీలు రెచ్చగొట్టే విధంగా చేసే ప్రకటనలు నమ్మొద్దు. విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమే. చదువుకున్న వారు ప్రయోజకులు అవుతారు. సామాజిక స్పృహతో సమాజానికి సేవచేసే వారు సమాజంలో హీరోలు అవుతారు. పాఠశాలల్లో విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు గ్రూప్ డిస్కషన్స్ ఏర్పాటు చేయాలి. ఉన్నత చదువులు చదవాలి.. తెలంగాణ పునర్నిర్మాణంలో మీరంతా భాగస్వాములు కావాలి'' అని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# కులగణనకు డెడికేషన్ కమిషన్

(మొదటి పేజీ తరువాయి)



విశ్రాంత ఐఏఎస్ అధికారి భూసాని వేంకటేశ్వరరావును నియమించింది. కమిషన్ ఏర్పాటు చేస్తూ బీసీ కులగణనపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. దీని ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే సంక్రాంతి లోపు తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తోంది. అయితే కులగణన తర్వాతే ఎన్నికలు జోలికి పోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు డెడికేషన్ కమిషన్‌ను నియమించి నెల రోజుల లోపు నివేదిక ఇవ్వాలని గడువు విధించింది.

రేపటి నుంచి కుల సర్వే ప్రారంభం..

రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని సీఎం స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాల మేరకు వెంటనే బీసీ డెడికేటేడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన నేటిలోగా ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కీలకమైన అంశాల్లో ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు ఉండవని, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలోనూ పారదర్శకంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు.

# ప్రేమించడం లేదని యువతిపై కత్తితో దాడి

**ప్రజానావ, మెదక్:**

డిగ్రీ విద్యార్థినిపై పట్టపగలే ఓ ప్రేమోన్మాది కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడిన విషాద ఘటన మెదక్ పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దివ్యవాణి ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాసేందుకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చింది. మెదక్ పక్కనే ఉన్న అవుసులపల్లి గ్రామంలో బంధువుల వద్ద ఉంటూ పరీక్షలు రాస్తోంది. అయితే, కొన్నాళ్ల నుంచి దివ్యవాణిని బెంగళూరుకు చెందిన చేతన్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తన ప్రేమను అంగీకరించలేదన్న కోపంతో యువతిపై కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఇవాళ ఉదయం పరీక్ష రాసేందుకు వెళ్తున్న దివ్యవాణి వద్దకు వెళ్లిన చేతన్ మొదట ఆమె చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌ను పగలగొట్టాడు. అనంతరం తన వెంట తీసుకొవచ్చిన కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దుర్ఘటనలో యువతి చేతికి తీవ్ర గాయం కాగా.. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీప ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మెదక్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ప్రతి గ్రామంలో గత ఐదేళ్లలో సర్పంచులు రూ. 5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు అభివృద్ధి పనులు చేశారు. కొంత ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చాయి. మరికొంత గ్రామ సర్పంచులు కలిపి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. బిల్లులు మాత్రం రాలేదు. దీంతో చాలామంది సర్పంచులు అప్పులపాలయ్యారు. పెండింగ్ బిల్లుల కోసం రోడ్డెక్కారు. ఇన్నాళ్లు పెండింగ్ బిల్లుల కోసం మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టారు. కానీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి హామీ, ప్రకటన రాలేదు. దీంతో వారి ఆందోళనను రాజధానికి షిఫ్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చారు. పోరుబాట నేపథ్యంలో.. మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. ఏలాగోలా పోలీసుల నుంచి తప్పించుకొని కొందరు సర్పంచులు హైదరాబాద్ వచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని ప్రయత్నించారు. రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి పెండింగ్ బకాయిలు చెల్లించాలని విజ్ఞాపన పత్రం ఇవ్వాలనుకున్న మాజీ సర్పంచులను.. పోలీసులు అరెస్టు చేశారు. బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో బిల్లులు చెల్లించాలని సీఎం, గవర్నర్ సహా అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా



పట్టించుకోవట్లేదని ఆరోపిస్తున్నారు.

అరెస్టులను ఖండించిన హరీశ్ రావు, బండి సంజయ్.. వారి అరెస్ట్‌లను మాజీ మంత్రి హరీశ్ రావు ఖండించారు. అరెస్ట్ అయినవారిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, , వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తోపాటు పలువురు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మాజీ సర్పంచ్‌ల అరెస్టులను, అక్రమ నిర్బంధాలను తీవ్రంగా ఖండించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడమేంటని ప్రశ్నించారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా అని నిలదీశారు. పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేపట్టిన మాజీ సర్పంచులను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో ఆందోళనలను అణదొక్కాలని చూడటం అవివేకమన్నారు. అరెస్ట్ చేసిన సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: మంత్రి పొన్నం**

తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా భారాస నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

# ఏడాది పాలనలో పదేళ్ల విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని మండిపడ్డారు. 'తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలనలో పదేళ్ల విధ్వంసం జరిగింది. తెలంగాణ ప్రజలు పిలిస్తే క్షణాల్లో వస్తానన్న రాహుల్ గాంధీ ఇన్నాళ్లు ఎక్కడ దాక్కుకున్నారు?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'గాంధీ భవన్‌కు కాదు ప్రజల దగ్గరకు వెళ్లే దమ్ముందా? ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో మోసం చేసినందుకు తెలంగాణ ప్రజలకు ముందు క్షమాపణ చెప్పు' అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఏడాదిలోనే అన్ని వర్గాలను రోడ్డెక్కించిన ఘనత మీ ప్రభుత్వానిదేనని తెలిపారు. 'సబ్బండ వర్గాలను మోసం, నయవంచనకు గురి చేసిన పాపంలో ప్రధాన పాత్ర మీదే. మీ వైఫల్యాలు చిత్రగుప్తుడి చిట్టా అంతా ఉన్నాయి. పులకేసి మాదిరిగా మీ ముఖ్యమంత్రి ప్రజలను హింసిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? రాహుల్ గాంధీకి దమ్ముంటే హైడ్రా.. మూసీ బాధితులకు వద్దకు వెళ్లాలి. మీ చేతగాని పాలనతో రైతులు, నేతన్నలు, ఆటో డ్రైవర్ల ఉసురు పోసుకున్నారు' అని కేటీఆర్ దుమ్మెత్తిపోశారు.

**సబ్బండ వర్గాలను మోసం చేసిన ఘనత..**

'పార్టీ ఫిరాయింపులతో రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్న మీ ముఖ్యమంత్రికి ఎందుకు అండగా ఉన్నారు?' అని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 'మీ అనుమతితోనే అదానీతో దోస్తీ, మూసీ ప్రాజెక్ట్ చేపడుతున్నారు. అభివృద్ధి పథంలో ఉన్న తెలంగాణను అవీనీతి తెలంగాణాగా మార్చారు. తెలంగాణ ప్రజల తరపున అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి' కేటీఆర్ డిమాండ్ చేశారు. అధికారం కోసం హామీలిచ్చి సబ్బండ వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ తరపున తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. తెలంగాణకు వస్తున్న రాహుల్ గాంధీకి పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఎలా వందేళ్ల విధ్వంసానికి గురైందో గుర్తు చేస్తున్నా' అంటూ కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజల గొంతును తడిగుడ్డతో కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పది నెలల పాలనలో రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా అన్ని వర్గాలను నయనంచనకు గురిచేశారని వాపోయారు.

# నేడు రాష్ట్రానికి రాహుల్ గాంధీ

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ నేడు హైదరాబాద్ రానున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన ప్రక్రియకు శ్రీకారం చుట్టుబోతోంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ వేదికగా బోయిన్‌పల్లిలోని గాంధీ నాలెడ్జ్ సెంటర్‌లో కులగణన పై సంప్రదింపుల సదస్సును మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. సాయంత్రం 4 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్న ఆయన అక్కడి నుంచి బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడ పార్టీ నేతలు, విద్యావేత్తలతో సమావేశమై కులగణనపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. ఈ సమావేశానికి దాదాపు 400 మందికి ఆహ్వానం అందినట్లు సమాచారం. కాస్ట్ సెన్సెస్‌ను ఎలా అమలు చేయాలనే దానిపై మేధావులు, సీనియర్లతో చర్చిస్తారని తెలుస్తోంది.

# మూసీ మురికి ప్రజలను పీడిస్తుంది

**ప్రజానావ, హైదరాబాద్:**



నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిన్నర మంది జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన మూసీ ప్రక్షాళనను అన్యాయంగా అడ్డుకొని తమను బద్నాం చేయాలని చూస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విపక్షాలపై మండిపడ్డారు. అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని, లేదంటే మూసీ మురికి ప్రజలను మరింత పీడిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే ఇక రాజకీయాల్లో కొనసాగడం వృథా అన్నారు. కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆ నదుల నీళ్లతో వ్యవసాయం చేస్తుంటే మూసీ పరీవాహక ప్రాంతంలోని నల్గొండ ప్రజలు మురికి నీటిని ఎందుకు వాడుకోవాలని నిలదీశారు. మూసీ ప్రక్షాళన కోసం అందరం కలిసి కట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని విమర్శించారు. దశాబ్దాలుగా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలు కాళ్లు, చేతులు వంకరలు పోయి, క్యాన్సర్ వంటి జబ్బులతో చచ్చిపోతుంటే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులపై బీజేపీ కసరత్తు

**ప్రజానావ, ఖైరతాబాద్:**




తెలంగాణలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలపై కమలం పార్టీ దృష్టి సారించింది. త్వరలో టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై బీజేపీ చేపట్టిన కసరత్తు ముగిసినట్లు తెలుస్తోంది. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ విద్యాసంస్థల అధినేత వైపే పార్టీ మొగ్గు చూపినట్లు సమాచారం. కమలం పార్టీ నేతలు కూడా బిగ్‌షాట్ విషయంలో సుముఖంగా ఉన్నారట. కరీంనగర్‌ఆదిలాబాద్‌నిజామాబాద్‌మెదక్ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు మాత్రం ఆశావహుల పోటీ విపరీతంగా ఉంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి మెదక్ జిల్లాకు చెందిన గోదావరి అంజిరెడ్డి, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రఘునాథరావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రావ్ ప్రధానంగా రేసులో ఉన్నారు. గోదావరి అంజిరెడ్డి, రఘునాథరావు ఈ సీటు కోసం గట్టిగా ప్రయత్నాలు కూడా చేస్తున్నారని పార్టీలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. రేసులో ఉన్నవారి పలుకుబడి, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని పార్టీ అధిష్ఠానం కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కరీంనగర్‌ఆదిలాబాద్‌నిజామాబాద్‌మెదక్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి గతంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన మామిడి సుధాకర్ రెడ్డి, విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ - రంగారెడ్డి -మహబూబ్ నగర్ టీచర్స్ ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డికి అవకాశం ఇచ్చామని, మరోసారి కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారికే కేటాయిస్తే విమర్శలు వచ్చే అవకాశముందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

**లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు...**

లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు సాధించిన బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలపై కమలనాథులు కన్నేశారు. తెలంగాణలో వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అందులో రెండు టీచర్, ఒకటి గ్రాడ్యుయేట్ స్థానాలు ఉన్నాయి. వాటి కోసం ఇప్పటికే ఓటర్ల నమోదు ప్రక్రియ కూడా ప్రారంభమైంది. కరీంనగర్‌ఆదిలాబాద్‌నిజామాబాద్‌మెదక్ టీచర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు. వరంగల్‌ఖమ్మంనల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికీ ఎన్నిక జరగాల్సి ఉంది. కరీంనగర్‌ఆదిలాబాద్‌మెదక్‌నిజామాబాద్ జిల్లాల్లో తమకు గట్టి పట్టుందని, ఆ రెండు సీట్లలో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ పక్కా ప్రణాళికలు రచిస్తోంది. పట్టున్న చోట 10 మందికిపైగా ఆశవహులు ఉంటే.. వరంగల్‌ఖమ్మంనల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ టికెట్‌కు మాత్రం పోటీ పెద్దగా లేదు. ఈ స్థానం కోసం ఉపాధ్యాయ సంఘం లీడర్‌గా పని చేసిన వ్యక్తితో పాటు సంఘ్ పరివార్‌కు చెందిన మరో టీచర్ పోటీ పడుతున్నారట. పీఆర్టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సర్వోత్తమ్ రెడ్డి, సంఘ్ పరివార్‌కు చెందిన టీపీయూఎస్ నాయకుడు సాయిరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మరి బీజేపీ నేతలు రచిస్తున్న వ్యూహాలు ఫలిస్తాయా ? లేదా? అన్నది వేచి చూడాల్సిందే..!

# దేశంలో ఉత్తమ స్పోర్ట్స్ పాలసీగా ఏపీ నూతన క్రీడా పాలసీ




**ప్రజానావ, అమరావతి:**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తోన్న స్పోర్ట్స్ పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా ఏపి స్పోర్ట్స్ నూతన పాలసీ ఉంటుందని సీఎం అన్నారు. అందరికీ క్రీడలు అనే విధానంతో తీసుకు వచ్చిన పాలసీపై అధికారులతో సీఎం చర్చించారు. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు నాలుగు మిషన్ ఆబ్జెక్ట్స్ తో పాలసీని సిద్ధం చేశారు. స్పోర్ట్స్ ఫర్ ఆల్, నర్చర్ టాలెంట్, స్పోర్ట్స్ ఎకో సిస్టం, గ్లోబల్ విజిబిలిటీ అనే అంశాల ప్రాతిపదికగా పాలసీని రూపొందించారు. ఈ నాలుగు మిషన్ ఆబ్జెక్ట్స్ లో అందరికీ ఆటలు, టాలెంట్ గుర్తింపు, ప్రపంచ స్థాయి శిక్షణ, ప్రోత్సాహకాలు, క్రీడాకారులకు మద్దతు, ఉద్యోగ భద్రత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు, క్రీడా సంఘాలతో సమన్వయం, టెక్నాలజీ వాడకం, ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహణ, స్పోర్ట్స్ టూరిజం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పాలసీల కంటే మెరుగైన అంశాలను చేర్చారు. గ్రామ స్థాయి నుంచి క్రీడల ప్రోత్సాహకానికి అవసరమైన ప్రణాళికను పొందుపరిచారు. ఇందులో భాగంగా పలు ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్ ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. యూనిఫాం సర్వీసెస్ లో 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పాలసీలో ప్రతిపాదించారు. శాప్ లో గ్రేడ్ 3 కోచ్ ల కోసం ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో పతకాలు పొందిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రోత్సాహకాల్లో హర్యానా రాష్ట్రం ముందుండగా.....ముఖ్యమంత్రి సూచనలతో కొత్త పాలసీలో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ప్రోత్సాహలు ప్రతిపాదించారు.

- రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు నాలుగు లక్ష్యాలతో పాలసీ రూపకల్పన
- ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 2 నుంచి 3 శాతానికి పెంచుతూ నిర్ణయం
- ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్ విజేతలకు ఇచ్చే ప్రోత్సాహకం భారీగా పెంపు
- ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధిస్తే ఇచ్చే ప్రోత్సాహకం రూ.75 లక్షల నుంచి రూ.7 కోట్లకు పెంపు
- స్పోర్ట్స్ ఫర్ ఆల్ విధానంతో నూతన క్రీడా పాలసీకి సీఎం చంద్రబాబు ఆమోదం

### పతకాలు సాధించే క్రీడాకారులకు భారీ ప్రోత్సాహకాలు

పతకాలు సాధించే వారికి మంచి ప్రోత్సాహకాలు అందిస్తే క్రీడల పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆటలు ఆడేవాళ్లకు గుర్తింపు, గౌరవం ఇవ్వాలని సీఎం అన్నారు. ఒలంపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ.75 లక్షలు ఇస్తుండగా...దీన్ని ఇకపై రూ.7 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే రజత పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు ఇస్తుండగా.....ఇకపై రూ.5 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ. 30 లక్షలు ఇస్తుండగా ఇకపై రూ.3 కోట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ఒలంపిక్స్ లో పాల్గొన్న వారికి రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని సీఎం సూచించారు. అదే విధంగా ఏషియన్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.4 కోట్లు, రజత పతకం సాధించిన వారికి రూ.2 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.1 కోటి చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఏషియన్స్ గేమ్స్ లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని సూచించారు. వరల్డ్ ఛాంపియన్ షిప్, వరల్డ్ కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.35 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. నేషనల్ గేమ్స్ లో బంగారు పథకం సాధించిన వారికి రూ.10 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.5 లక్షలు, కాంస్య పథకం సాధించిన వారికి రూ.3 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.2.50 లక్షలు, రజత పతకం సాధించిన వారికి రూ.2 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.1 లక్ష చొప్పున ప్రోత్సాహం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఒలంపిక్, ఏషియన్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారికి గ్రూప్ 1 ఉద్యోగులుగా నియమిస్తామని తెలిపారు. అదే విధంగా స్పోర్ట్స్ సిటీగా అమరావతిని రూపొందించడంతో పాటు తిరుపతి, వైజాగ్, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయాలన్నారు. కడప, విజయవాడ, విజయనగరం క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో విజయనగరం క్రీడా పాఠశాల గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యంత పాపులర్ అయిన స్పోర్ట్స్ లీగ్స్ లో ఏపీ నుండి జట్లు ప్రాతినిధ్యం వహించేలా చూడాలన్నారు. ఏపీకి వరంగా సముద్ర తీరం, కొండలు, అడవులు ఉన్నాయని...మౌంటెయిన్ బైకింగ్, వాటర్ స్పోర్ట్, నేచర్ ఫోటో గ్రఫీ, ట్రెక్కింగ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఆటలు అంటే క్రికెట్ ఒక్కటే కాదని...అన్ని ఆటలను ప్రోత్సహించాలని సిఎం అన్నారు. ఆటలను తమ గోల్ గా ఎంచుకునేవారికి ఉద్యోగ భద్రత కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని...ఎక్కువ మంది ఆ వైపు ప్రయాణం చేస్తారని సిఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకువచ్చిన విధానాల కారణంగా అనేక మంది క్రీడాకారులు తయారయ్యారని...వారు ఒలంపిక్స్ లో కూడా సత్తా చాటారని సిఎం అన్నారు. పిపిపి విధానంతో పాటు....స్వచ్ఛంధంగా ఆసక్తి చూపే వ్యక్తులు, సంస్థల ద్వారా మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని అన్నారు. ఈ సూచనల ప్రకారం మార్పులు చేసి కేబినెట్ లో నూతన పాలసీ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వరదవెల్లిలో బోట్ సేవలు అందుబాటులోకి



### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి దత్తాత్రేయ స్వామి ఆలయ దర్శనం

**ప్రజానావ, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లిలోని దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు బోట్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. బోయినిపల్లి మండలం వరదవెల్లి విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి స్థానిక గ్రామ దేవత పోచమ్మ తల్లిని సోమవారం దర్శించుకున్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి బోట్ సేవలను ప్రారంభించారు.

జిల్లా కలెక్టర్ తోపాటు స్వయంగా బోట్ లో వెళ్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బోట్ సేవలు అందుబాటులోకి రావడంవల్ల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. అందరూ దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడంతోపాటు ప్రతి ఒక్కరూ స్వామి ఉత్సవాల్లో సంతోషంగా పాల్గొనే అవకాశం లభించిందని పేర్కొన్నారు.



# సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి





### ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
### 122 దరఖాస్తుల స్వీకరణ

**ప్రజానావ, సిరిసిల్ల:**

ప్రజావాణిలో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయానికి పరిష్కరించాలని సూచించారు. మొత్తం 122 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 56, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 18, ఉపాధి కల్పన శాఖకు 11, సిరిసిల్ల మున్సిపల్ కు 7, డీఆర్డీఓ, సెస్, సర్వే, ఎంపీడీఓ కొనరావుపేట కు మూడు చొప్పున, విద్యా శాఖ, ఎంపీడీఓ తంగళ్ళపల్లి, గంభీరావుపేట, వేములవాడకు రెండు చొప్పున, కార్మిక శాఖ, జిల్లా సంక్షేమ అధికారి, ఆర్టీసీ సిరిసిల్ల, జిల్లా వైద్యాధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, ఎంపీడీఓ ఇల్లంతకుంట, వేములవాడ రూరల్, ఎల్లారెడ్డి పేటకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి




### పత్తి రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొంది ఆర్థికంగా బలపడాలి
### పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
### హాజరైన జిల్లా కలెక్టర్, ఆదనపు కలెక్టర్

**ప్రజానావ, వేములవాడ అర్బన్ / కోనరావు పేట:**

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని పత్తి రైతులు ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి, సంకేపల్లి, కోనరావు పేట మండలం సుద్దాలలో ఏర్పాటుచేసిన సి.సి.ఐ. పత్తి కొనుగోలు కేంద్రాలను ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, అదన కలెక్టర్ ఖీమ్యా నాయక్ సోమవారం హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. పత్తి రైతులు దళారులకు తమ పంటను విక్రయించవద్దని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లాలో ఇప్పటికే 200 పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. తేమ శాతం సరిగ్గా ఉన్న ధాన్యాన్ని సేకరిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ధాన్యం నిల్వలకు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆపేరల్ పార్క్ వద్దన్న గోదాములను పరిశీలించామని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. మిగతా రైతులకు కూడా సాంకేతిక సమస్యలతో రుణమాఫీ నిలిచిపోయిన వారి సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. రైతు భరోసా కూడా త్వరలోనే పంపిణీ చేయనున్నామని తెలిపారు. జిల్లాలో పత్తి పండించిన రైతులు 8 నుంచి 12 శాతం తేమతో తమ పరిధిలోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించి విక్రయించాలని పేర్కొన్నారు.ఎన్ని శాతంతో ఏమన్నా పత్తి క్వింటాల్ కు 7,521 రూపాయలు, అలాగే 8 నుంచి 12 శాతం లోపు ఉన్న పత్తికి 7,200 నుంచి 7,445 మద్దతు ధరగా సీసీఐ నిర్ణయించిందని తెలిపారు. దీంతో రైతులకు తూకం విషయంలో అలాగే డబ్బుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. అలాగే ఇల్లంతకుంట మండలంలో సిసిఐ ఆధ్వర్యంలో రెండు పత్తికొండ కేంద్రాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. రైతులు రైతులను రాజుగా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ సీజన్ ముగిసిన తర్వాత రైతుల పొలాలలోని మట్టి పరీక్షలు చేయించి దానికి అనుగుణంగా విత్తనాలు ఎంపిక, ఎరువుల వాడకం త్వరలో చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, సిసిఐ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత గడ్డపై భారత్‌కు ఝలక్

## ఈ షాక్ నుంచి తేరుకోవడం కష్టమే!



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో సొంత గడ్డపై జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్‌కు గురికావడాన్ని కోట్లాది మంది అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. చివరి టెస్టులో 147 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా ఛేదించడంలో భారత్ విఫలమైంది. భారత టెస్టు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సొంత గడ్డపై ఓ టీమ్ చేతిలో క్లీన్‌స్వీప్ కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కెప్టెన్‌గా రోహిత్ శర్మ, ప్రధాన కోచ్‌గా గౌతం గంభీర్ పూర్తిగా తేలిపోయారు. న్యూజిలాండ్ వంటి అనామక జట్టు చేతిలో ఘోర పరాజయం చవిచూడడం అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. సిరీస్ ఆరంభానికి ముందు భారత్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. న్యూజిలాండ్ కిందటి సిరీస్‌లో శ్రీలంక చేతిలో వైట్‌వాష్ అయ్యింది. ఇలాంటి స్థితిలో భారత్‌ను ఓడించడం అటుంచి కనీసం ఒక్క మ్యాచ్‌నైనా డ్రా చేస్తే న్యూజిలాండ్‌కు అతి పెద్ద విజయమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**అంచనాలు తారుమారు..**

అయితే తొలి టెస్టు మొదటి రోజే విశ్లేషకుల అంచనాలు తారుమారయ్యాయి. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలింది. ఈ పరిణామం అందరిని షాక్‌కు గురి చేసింది. రోహిత్ శర్మ, కోహ్లి, రిషబ్, యశస్వి, జడేజా, రాహుల్, అశ్విన్ వంటి స్టార్ ఆటగాళ్లతో కూడిన టీమిండియా ఇంత తక్కువ స్కోరుకు ఆలౌటవుతుందని ఎవరూ ఊహించలేక పోయారు. ఆ తర్వాత భారత్ ఏ దశలోనూ మళ్లీ కోలుకోలేక పోయింది. న్యూజిలాండ్ మాత్రం అసాధారణ ఆటతో భారత్ వంటి బలమైన జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్రతి సెషన్‌లోనూ న్యూజిలాండ్‌దే ఆధిప్యం సాగింది. సొంత గడ్డపై భారత్‌కు గతంలో ఎన్నడూ కూడా ఇలాంటి దుస్థితి ఎదురు కాలేదంటే అతిశయోక్తి కాదు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ప్రపంచ స్థాయి బ్యాటర్లు ఉన్న టీమిండియా ప్రత్యర్థి టీమ్ కివీస్ బౌలర్ల ధాటికి ఎదురు నిలువలేక పోయింది. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ అలవోక విజయం సాధించింది. మ్యాట్ హెన్రి, ఓ రౌర్కి, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, విల్ యంగ్, డారిల్ మిచెల్ తదితరులు కివీస్ విజయంలో ముఖ్య భూమిక పోషించారు. ఇక పుణె వేదికగా జరిగిన రెండో టెస్టులోనూ భారత్ పూర్తిగా తేలిపోయింది. ఈసారి కూడా బ్యాటింగ్ వైఫల్యం టీమిండియాను వెంటాడింది. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు మరోసారి నిరాశ పరిచారు. అశ్విన్ బంతితో పాటు బ్యాట్‌తోనూ మెరువలేక పోయాడు. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ తప్ప మిగతా బ్యాటర్లు పెద్దగా ప్రభావం చూపలేక పోయారు. బౌలర్లు బాగానే రాణించినా బ్యాటింగ్ వైఫల్యం భారత్ కొంపముంచింది. ఈ టెస్టులోనూ టీమిండియాకు ఘోర పరాజయం తప్పలేదు. మరోవైపు న్యూజిలాండ్ అద్భుత ఆటతో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. ఇదే క్రమంలో భారత గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలిచి చరిత్ర సృష్టించింది. మూడో టెస్టులోనూ భారత్‌కు ఘోర పరాజయం తప్పలేదు. ఈసారి కూడా బ్యాటింగ్ ప్రతికూలంగా మారింది. కివీస్ బౌలర్లను ఎదుర్కొడంలో భారత బ్యాటర్లు పూర్తిగా తేలిపోయారు. ఎజాజ్ పటేల్, ఫిలిప్స్ అసాధారణ ప్రదర్శనతో టీమిండియా బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. చివరికి 147 పరుగుల సునాయాస లక్ష్యాన్ని కూడా భారత్ ఛేదించలేక అవమానకర రీతిలో ఓటమి మూటగట్టుకుంది.

**సవాల్ వంటిదే..**

ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియా గడ్డపై త్వరలో జరిగే ఐదు మ్యాచ్ టెస్టు సిరీస్ టీమిండియాకు సవాల్‌గా తయారైంది. సొంత గడ్డపైనే వైట్‌వాష్‌కు గురైన భారత్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉండే ఆస్ట్రేలియా గడ్డపై ఎలా ఆడుతుందనేది ఆందోళన కలిగించే అంశమే. ఈసారి కూడా భారత్‌కు బ్యాటింగ్ కష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. సీనియర్లు రోహిత్, కోహ్లిలు ఫామ్‌లో లేక పోవడం టీమిండియాకు ప్రతికూలంగా మారింది. జట్టును ముందుండి నడిపించాల్సిన వీరు ఎలా ఆడతారనే దానిపైనే జట్టు గెలుపు అవకాశాలు ఆధారపడి ఉంటాయనడంలో ఎలాంటి



# క్రికెట్‌కు సాహా గుడ్‌బై

**కోల్‌కతా:** టీమిండియా సీనియర్ క్రికెటర్ వృద్ధిమాన్ సాహా క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్టు సాహా వెల్లడించాడు. ఈ రంజీ సీజనే తన కెరీర్‌లో చివరిదని స్పష్టం చేశాడు. 40 ఏళ్ల సాహా 2010లో అంతర్జాతీయ క్రికెట్ శ్రీకారం చుట్టాడు. భారత్ తరపున 40 టెస్టులు, 9 వన్డేలు ఆడాడు. ఐపిఎల్‌లోనూ వివిధ జట్లకు ప్రాతనిథ్యం వహించాడు. 2021లో వాంఖడే వేదికగా కెరీర్‌లో చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు. అంతర్జాతీయ కెరీర్‌లో సాహా 1300 పరుగులు చేశాడు. టెస్టుల్లో మూడు సెంచరీలు నమోదు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో సాహాకు మెరుగైన రికార్డు ఉంది. ఏడు వేలకు పైగా పరుగులు సాధించిన సాహా 14 సెంచరీలు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఐపిఎల్‌లో 170 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో ఓ సెంచరీ, మరో 13 అర్ధ సెంచరీలు సాధించాడు.

# హాకీ కెప్టెన్‌గా సందీప్

**ప్రజానావ/హైదరాబాద్:** జాతీయ సీనియర్ పురుషుల హాకీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్టును ఎంపిక చేశారు.చెన్నై వేదికగా ఈ పోటీలు జరుగనున్నాయి. టోర్నీలో పాల్గొంటున్న రాష్ట్ర జట్టుకు సందీప్ సుబేదార్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ క్రమంలో 18 మదితో కూడిన పురుషుల టీమ్‌ను రాష్ట్ర హాకీ సంఘం ఎంపిక చేసింది. అంతేగాక టోర్నీలో పాల్గొంటున్న జట్టుకు కిట్స్‌ను కూడా బహూకరించారు. ఠాకూర్ గజేందర్ సింగ్, జయప్రకాశ్ రెడ్డి, వెంకటేష్, రాజు, అబ్దుల్ మోయిజ్, షేక్ ఇబ్రాహీం, శివకుమార్, మహేందర్, రాహిత్ సింగ్, సందీప్ సుబేదార్ (కెప్టెన్), అఫ్వాన్ ఖాన్, రవితేజ, రామ్‌కుమార్, అక్షయ్, సందీప్, గోకుల్ కార్తీక్, అర్జున్, అవినాష్.

### పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు

# తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

- గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరుపై ప్రశంస

**ప్రజానావ, గంభీరావుపేట:**



పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణం న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం గంభీరావుపేట్ పోలీస్ స్టేషన్ ఆయన తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డ్స్ , వర్టికల్స్ అమలు తీరు, స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్, పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సీడీ ఫైల్స్‌లను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బందికి అంకితభావంతో విధులను నిర్వర్తించాలన్నారు. నేరాల నియంత్రణకు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. బ్లూ కోల్ట్ సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్ లు, రౌడీ షీటర్లపై నిఘాను ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలని సూచించారు.

# రాజన్న ఆలయంలో వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజానావ, వేములవాడ**

సామూహిక కార్తీక దీపోత్సవం సందర్భంగా రాజన్న ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ ఈవో కే. వినోద్ రెడ్డి సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కళావేదిక ప్రాంగణంలో లత బృందం వారిచే ఏర్పాటు చేసిన భక్తి విభావరి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు డిసెంబర్ 1 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, స్థానాచారి అప్పాల బీమాశంకర్, ఏఈఓ గజ్వేల్లి రమేశ్ బాబు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.













కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు ఆలయ ముందు భాగంలో, ధర్మగుండం వద్ద దీపాలు వెలిగించి కార్తీక మాస పూజలు నిర్వహించారు. కాగా, సోమవారం 76,329 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

-ప్రజానావ , వేములవాడ

# జిల్లాలో 475 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

## ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



**ప్రజానావ, నార్సింగి:**

నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ఐకేపీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రోహిత్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు ధర్నాలు చేసేంత వరకు వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు కారని, తమది ప్రజా ప్రభుత్వం రైతులు ప్రభుత్వం కాబట్టి కోతలు కాక ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుల కోసం 475 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకోవడం జరుగుతుందని, రైతులు దళారులను నమ్మకుండా తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి, పంటకు గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఏ గ్రేడ్ రకానికి 2320 రూ, బీ గ్రేడ్ రకానికి 2300, సన్న వడ్లను ఐదు వందల బోనస్ కూడా రైతులకు అందిస్తారని తెలిపారు. అనంతరం మహిళా భవనం కోసం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి తహశీల్దార్ షేక్ కరీం, ఎంపీడీవో ఆనంద్, ఐకేపీ ఏపీఎం అశోక్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోవర్ధన్, నార్సింగి గ్రామ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పార్స సంతోష, యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, అంచానూరి రాజేష్, శంకరంపేట్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ తాళ్ళ కృష్ణాగౌడ్, లక్ష్మి నర్సింహులు, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.




# గడువులోగా దరఖాస్తు పూర్తి చేసుకోవాలి

**ప్రజానావ, తూప్రాన్:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటు హక్కును గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పట్టబద్రులు, ఉపాధ్యాయుల దరఖాస్తులకు సమయం ఇంకా 3 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున ఈ నెల 6వ తేదీతో మన ఉమ్మడి కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ముగియనున్నందున తుప్రాన్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. సోమవారం హెల్ప్ లైన్ డెస్క్‌లో తుప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ తన ఓటును నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. తుప్రాన్ డివిజనల్ కేంద్రంలో ఉన్న పట్టభద్రులు తమ ఓటు నమోదుకై ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు స్థానిక తహశీల్దార్ ఆఫీస్‌లో గాని, ఆర్డీవో ఆఫీస్‌లో గాని ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# రోడ్లపై ధాన్యాన్ని పోయొద్దు

## రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి




**ప్రజానావ, దౌల్తాబాద్:**

రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్పలు కనపడక ధాన్యం కుప్పలకు ఢీకొని ఎంతోమంది మృతి చెందిన సంఘటనలు తరచూ చూస్తున్నామని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రోడ్లపై ఎవరూ ధాన్యం ఆరిబోయకూడదని రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లమీద దాన్యం ఆరబోయడం వలన అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రమాదాల నివారణ గురించి రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయరాదన్నారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో అది గమనించక ప్రమాదాల బారినపడుతున్నారు. బావిదగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాల్లో ధాన్యం ఆరబోయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని ద్విచక్ర వాహనదారులు తగిలి మృతి చెందుతున్నారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా ఆరబోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



# పకడ్బందీగా సమగ్ర సర్వే

## దౌల్తాబాద్ తహశీల్దార్ చంద్రశేఖరరావు

**ప్రజానావ, దౌల్తాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దౌల్తాబాద్ తహశీల్దార్ చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక సామాజిక రాజకీయ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తుందని ఆ సర్వేలో పాల్గొనే అధికారులు ఎలాంటి పొరపాట్లు చేయకుండా వారికి కేటాయించిన కుటుంబాలను పూర్తి సమాచారంతో సర్వే నిర్వహించాలన్నారు. ఒక్కొక్క అధికారికి 150 కుటుంబాలు కేటాయించడం జరిగిందని వారు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రతి కుటుంబం నుంచి ఏరియా పరిధి పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు. సర్వే నివేదిక ఫారంలో ఉన్న అంశాలను పూర్తిస్థాయిలో వాస్తవాలను సేకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే నిర్వహించడానికి అధికారులు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీవో సయ్యద్ గఫూర్ ఖాద్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ,

# 'రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దు'

## పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



**ప్రజానావ, గజ్వేల్:**

రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. సోమవారం సీపీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవుచున్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలి, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు, రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోతున్నారన్నారు. రోడ్లపై ధాన్యం పోయవద్దని పోలీస్ అధికారులు సిబ్బంది కూడా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ

# పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**ప్రజానావ, దౌల్తాబాద్:**



మహిళలను ఆర్థిక శక్తిగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఉద్దేశంతో ప్రభుత్వం శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేస్తుందని సిద్దిపేట జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ నాన్‌ఫామ్ వాసుదేవ్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రం మహిళా సమైక్య భవనంలో ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దౌల్తాబాద్, రాయపోల్ మండల మహిళ సమాఖ్య లబ్ధిదారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మనిర్ భారత్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆల్ ఇండియా సెంట్రల్ ప్రయోజిత ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం ద్వారా లబ్ధి పొందిన దౌల్తాబాద్, రాయపోల్ రెండు మండలాల లబ్ధిదారులకు ఫుడ్ ప్రాసెసింగ గురించి ఉండాల్సిన ధ్రువ పత్రాలు మొదలగు వాటి గురించి అవగాహన కల్పించామన్నారు. అలాగే ఆర్థిక వనరులను సృష్టించుకుని గొప్ప ఆర్థిక శక్తులుగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తయారుచేసిన ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ వంటి మొదలగు అంశాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రెండు రోజు శిక్షణ కార్యక్రమాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఫోర్కాస్ట్ సెన్సిటివిటీ అండ్ అబ్జర్వేషన్ ఇంపాక్ట్ మేనేజర్ రఘు వర్మ, ఐకేపీ ఏపీఎం యాదగిరి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, మహిళా సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడితే చర్యలు తప్పవు

## దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్



**ప్రజానావ, దౌల్తాబాద్:**

దౌల్తాబాద్ మండల పరిధిలో గ్రామాల్లో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి వాహనదారుల మరణానికి కారణం కావద్దని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్పలు కనపడక ధాన్యం కుప్పలకు ఢీకొని ఎంతోమంది మృతి చెందిన సంఘటనలు తరచూ చూస్తున్నామని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రోడ్లపై ఎవరూ ధాన్యం ఆరిబోయకూడదని అన్నారు. రోడ్లమీద దాన్యం ఆరబోయడం వలన అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అలాంటి ప్రమాదాల నివారణ గురించి రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయరాదన్నారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదాల బారినపడుతున్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం ఆరబోయడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని ద్విచక్ర వాహనదారులు తగిలి మృతి చెందుతున్నారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా ఆరబోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీ

# రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



**ప్రజానావ, తూప్రాన్:**

రైతుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం తూప్రాన్ మున్సిపల్ పరిధి పడాలపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారం రోజుల క్రితమే అధికారులు ప్రారంభించిన కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నాయకులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలను ప్రారంభించాలన్నారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామన్నారు. ఆయన వెంట రైతులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకం

- ఆ దిశగా గ్రంథాలయాలను ముందుకు తీసుకెళ్లింది పాత్రికేయుల ప్రపంచం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ





**ప్రజానావ, మెదక్:**
సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో గ్రంథాలయాలది కీలకపాత్ర అని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ మెదక్ గ్రంథాలయ చైర్మన్‌గా చిలుముల సుహాసినిరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా గ్రంథాలయ చైర్మన్‌ను చిలుముల సుహాసినిరెడ్డి మంత్రి సమక్షంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ నూతనంగా గ్రంథాలయ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన చిలుముల సుహాసినిరెడ్డి వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దామోదర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు విద్యావంతులు కావడానికి విద్యావంతమైన సమాజానికి ప్రధాన పాత్ర పోషించేది లైబ్రరీ లేనన్నారు. మన లైబ్రరీని మన సరస్వతీ మాత అని గౌరవించాలన్నారు. మెదక్ జిల్లా లైబ్రరీ అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఒక పుస్తకంతోనే సమాజ మార్పు సంతరించుకుంటుందన్నారు. ప్రతి వ్యక్తిని జీవితంలో ముందుకు నడిపేది ఒక పుస్తకం మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. ఈనాటి సమాజంలో సెల్‌ఫోన్‌లకు బానిసలై పుస్తకాలు చదివేవారు కనపడటం లేదన్నారు. ప్రతి ఒక్కరూ లైబ్రరీకి వెళ్లి ఒక మంచి పుస్తకం చదివి విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. ఈ రోజుల్లో మన పిల్లలను విద్యావంతులు అవడం ఎంత ముఖ్యమో సంస్కారవంతులు అవ్వడం కూడా అంతే ముఖ్యమన్నారు. సంస్కారం లేని విద్య గుడ్డివిద్యానని సమాజంలో సంస్కారం పెద్ద పాత్ర పోషిస్తుందని అనే భావన కలగాలన్నారు. మన పిల్లల్లో బాలురకు సమానంగా బాలికలు విద్యలో ముందుంటున్నారని విద్యావంతులు విద్యాధికులు అవుతున్నారే గాని సంస్కారవంతులు కాలేకపోతున్నారనే భావనలో భావోద్వేగాన్ని రేకత్తిస్తుందన్నారు. లక్ష్మీదేవి సరస్వతి దేవిని ఫాలో కావలె తప్ప సరస్వతి దేవి ఎప్పుడు కూడా లక్ష్మీదేవిని ఫాలో కాలేదని మన సమాజంలో ప్రతి ఒక్కరూ సరస్వతీ పుత్రుడు కావాలనదే తన తపన అని, లైబ్రరీలో చదివే పిల్లలను ప్రశ్నించినప్పుడు ఉన్నత చదువులు చదువుతున్నాం, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ ప్రిపేర్ అవుతున్నామని చెప్పడం చాలా సంతోషమన్నారు. రాజకీయం అంటే ప్రజలు సర్వం సేవ జవాబుదారీతనం మన పూర్వీకులు మనకు మనకు అందించిన మేరకు ఈ రకంగా ఆదర్శవంతులు కావాలన్నారు. రాజకీయాలు అంటే ఓట్లు ఎన్నికలు కొనుగోలు కాదని రాజకీయ అంటే తన భవిష్యత్తు తన కుటుంబం తన పిల్లల భవిష్యత్తు రాబోయే ఐదు సంవత్సరాల్లో ఎలా ఉండబోతుందని ఆలోచన శక్తి మనకు ఉండాలంటే సమాజ స్ఫూర్తి ఉండాలని, సమాజ స్ఫూర్తి ఉండాలంటే సంస్కృతిలో మార్పు ఉండాలని తల్లిదండ్రులు పునరాలోచన రావాలన్నారు. అలాంటి మార్పునకు పునాది పుస్తకం అని చెప్పారు. సీఎస్ఆర్ ఫండ్ కింద రకరకాల పుస్తకాలు తెలుగు, ఇంగ్లీష్ ఉర్దూ మన లైఫ్ లైబ్రరీలో చదువుకోవడానికి ఉంచుతున్నామన్నారు. గత 250 సంవత్సరాల క్రితం ప్రపంచ చరిత్రలో రకరకాల సిద్ధాంతాలు రాజకీయ వ్యవస్థ ఉన్నప్పుడు సిద్ధాంతాలకు రూపకల్పన చేసిన 250 సంవత్సరాలు లైబ్రరీ మూమెంట్ చాలా గొప్ప ప్రధాన పాత్రగా మిగిలిపోతాయన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన చిలుమల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ పరాయి పీడనలో భారతదేశం మగ్గుతున్నప్పుడు ఆనాటి మేధావి వర్గం ప్రజలను విద్యావంతులు చేసినప్పుడే వారి వారి హక్కులు సమస్యలు తెలుసుకోగలుగుతారని ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో విద్య యొక్క చాలా ప్రాముఖ్యత ఉందని అర్థం చేసుకొని మేధావులు గ్రంథాలయం పేరిట విరిగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం ప్రజలను చైతన్యం చేసి దేశభక్తిని పెంపొందించి స్వతంత్రచ్చను స్వాతంత్ర కాంక్షను పోరాడే శక్తిని పోరాటపడి నింపారన్నారు. గ్రంథాలయాలు ప్రాముఖ్యత పెరిగిందని సమాజంలో విద్యావంతమైన వారు భవిష్యత్తుకు ముందుకు వెళ్లే ప్రక్రియలో భాగంగా యువకులు, మహిళలు ఈ గ్రంథాలయాల్లో చదివే పుస్తకాల వలన చాలా లాభం జరిగిందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ యువత బంగారు భవిష్యత్తుకు గ్రంథాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి మంత్రి సలహాలు సూచనలతో ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, నర్సపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులు రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయగౌడ్, డీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరం

- యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ప్రజానావ, సిరిసిల్ల:**
ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఎస్పీముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ వైద్యులుగా ఎదిగి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలని, కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లు, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్షణం కాదన్నారు. విద్యార్థినులు, మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నాప్పుడే మరింత భద్రత కల్పించడం సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, కళాశాల యాజమాన్యం, విద్యార్థిలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చేసిన తప్పులు కాంగ్రెస్‌కు అంటగడుతారా?

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్**



**ప్రజానావ, గజ్వేల్:**
బీఆర్ఎస్ పదేండ్ల హయాంలో కేసీఆర్ చేసిన పాపాలన్నింటిని హరీశ్‌రావు కాంగ్రెస్‌కు అంట గడుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో జరిగిన తప్పిదాలను అప్పట్లో ప్రశ్నించని ఆయన ప్రస్తుతం ఆ తప్పులన్నింటిని సీఎం రేవంత్‌రెడ్డిపై వేస్తుండడం సిగ్గుచేటని నిలదీశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు సొంత డబ్బు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేయగా, ఆ మంచి పనులను బీఆర్ఎస్ ఖాతాలో వేసుకున్నప్పటికీ నిధులు మాత్రం మంజూరు చేయలేదని ఎద్దేవా చేశారు. అప్పుల పాలై కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ సర్పంచుల బిల్లులు కేసీఆర్ చెల్లించలేదని, ఈ విషయం తాజా మాజీ సర్పంచులకు తెలియంది కాదన్నారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని కేసీఆర్ తన హయాంలో టీచర్ల పదవీకాలం పెంచగా, ప్రస్తుతం వారు ఒక్కొక్కరుగా పదవీ విరమణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ పాపం కూడా తమపై వెయ్యడం ద్వారా నత్త కూడా నవ్వుతోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానా దోచుకున్న కేసీఆర్ కేటీఆర్ హరీశ్‌రావు కవితలు పెద్దపెద్ద ఫాం హౌజ్‌లు కట్టుకోగా, ఉద్యమ కాలంలో డొక్కు స్కూటర్, ప్లాస్టిక్ చెప్పులతో తిరిగిన హరీశ్‌రావు తన భార్య శ్రీనిజ పేరిట పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ ఘనకార్యంతో రాష్ట్రం అప్పుల పాలు కాగా, ప్రస్తుతం ఆ అప్పులు తీర్చడానికే మళ్లీ అప్పులు చేయడం, రాష్ట్ర ఆదాయం వెచ్చించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తమ తప్పిదాలు ఇతరులపై నెట్టకుండా ఆత్మ విమర్శ చేసుకోవాలని, తమ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల ఫలితంగా ప్రజలు బుద్ధి చెప్పినట్లు ఇప్పటికైనా గ్రహిస్తే మంచిదని హితవు పలికారు. అవసరమున్న ప్రతిచోట ధాన్యం, సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

- మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**ప్రజానావ, తూప్రాన్:**
గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ప్రతాప్‌రెడ్డి పర్యటించారు. ఇటీవల మరణించిన వడ్డే రాజు కుటుంబాన్ని అలాగే ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పూరి గుడిసె దగ్ధమైన ఎర్ర భూదమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం రోడ్లపై రైతులు ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటివరకు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే జాతీయ రహదారులపై రైతులు పండించిన ధాన్యంతో రాస్తారోకో చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ గోపీనాయక్, నాయకులు చంద్రం, స్వామి, బాబు, సత్యం, రాజు, పరమేశ్వర్, కృష్ణ, యాదగిరి, సాయిలు, జముల నాయక్, శ్రీనివాస్, గణేశ్ పాల్గొన్నారు.






## మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెంపుపై హర్షం

**ప్రజానావ, సిరిసిల్ల:**
ప్రభుత్వం గురుకులాల్లో మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడంపై బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరుశరాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అడిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో గురుకుల సంక్షేమ వసతి గృహాల్లోని 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన విజయవంతంగా పూర్తి చేసుకొని, బీసీ లకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కేంద్రం రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలని, బీసీ లకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీసీలంతా రానున్న రోజుల్లో ఒకతటిపై వచ్చి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు బిళ్ల వెంకట్రాములు, గోపీ గౌడ్, లోకం వెంకటేశం, ఎడ్ల నరేందర్, వేముల మహేశ్, జక్కని చిరంజీవి, బోనాల రాజు షార్పొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యమే కాదు అందం కూడా

**ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. ఆరోగ్యంగా ఉండాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అటువంటి ఆరోగ్యం కోసం మనం మంచి ఆహారపు అలవాట్లు చేసుకుంటే ప్రయోజనం కలుగుతుంది. ప్రతిరోజు మనం మన ఆహారంలో కొన్ని రకాల జ్యూస్ లు తాగితే లాభం చేకూరుతుంది. అలాంటి వాటిలో బీట్ రూట్ జ్యూస్ ఒకటి. బీట్ రూట్ దుంప రకానికి చెందినది.**

**బీట్ రూట్ తో ఆరోగ్య ప్రయోజనాలు**

ప్రతిరోజు మనం బీట్ రూట్ జ్యూస్ తాగితే చాలా ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్లు చెబుతున్నారు. బీట్ రూట్ లో ఉండే పోషకాలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని సూచిస్తున్నారు. బీట్ రూట్ రంగు ఏ విధంగా ఉంటుందో దాని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు కూడా అంతే బాగుంటాయి. బరువు తగ్గాలి అనుకున్నా, రక్తహీనత పోవాలన్నా, గుండె సమస్యల నుంచి బయట పడాలన్న ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది.

**అనేక ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం**

చాలామంది సెలబ్రిటీస్ ప్రతిరోజు బీట్ రూట్ జ్యూస్ తాగుతారు. బీట్ రూట్ లో ఉండే పోషకాలు విటమిన్ ఏ, విటమిన్ సి, క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం తో పాటు అనేక పోషకాలు మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. బీట్ రూట్ జ్యూస్ తాగే వారిలో గుండె పనితీరు మెరుగు పడుతుంది. బీట్ రూట్ జ్యూస్ గుండె సమస్యలను తగ్గించడమే కాకుండా, హైబీపీ తదితర సమస్యల నుంచి కూడా ఉపశమనం ఇస్తుంది.

**చర్మ ఆరోగ్యానికి బీట్ రూట్**

ఎముకలను దృఢంగా ఉంచే శక్తి బీట్ రూట్ జ్యూస్ లో ఉంది. మన చర్మాన్ని కాంతివంతం చేయడానికి బీట్ రూట్ జ్యూస్ ఎంతో సహాయపడుతుంది. గోళ్ళు, వెంట్రుకలు ఆరోగ్యంగా ఉండాలంటే కూడా బీట్ రూట్ జ్యూస్ తాగితే మంచిది. శారీరక దృఢత్వం కోసం బీట్ రూట్ జ్యూస్ తాగినట్లయితే మంచి ప్రయోజనం ఉంటుంది. దీని వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది.

**బీట్ రూట్ జ్యూస్ తాగితే బరువుకు చెక్**

రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. మన కాలేయాన్ని డిటాక్సిఫై చేస్తుంది బీట్ రూట్ జ్యూస్. ప్రతిరోజు ఒక గ్లాసు బీట్ రూట్ జ్యూస్ తాగితే శరీరంలో కొవ్వు కరుగుతుందని డైటీషియన్లు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా బీట్ రూట్ జ్యూస్ ను తాగటం అలవాటు చేసుకోవాలి. బీట్ రూట్ జ్యూస్ తాగడం వల్ల మలబద్ధకం కూడా తగ్గుతుంది.

**బీట్ రూట్ తో జ్ఞాపకశక్తి**

మన శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. అలసట లేకుండా రోజంతా మనం ఉత్సాహంగా ఉండే విధంగా ఇది చేస్తుంది. బీట్ రూట్ జ్యూస్ తాగితే మన జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెబుతున్నారు. మెదడుకు రక్త సరఫరా బాగా జరిగి మెదడు షార్ప్ గా పని చేస్తుందని కూడా చెబుతున్నారు. మన చర్మం నిగారింపును సొంతం చేసుకోవడానికి కూడా బీట్ రూట్ ఎంతగానో ఉపయో

**అందరి మనస్తత్వాలు ఒకలా ఉండవు. కొంతమంది మనసులో ఉన్న విషయాలేవీ దాచుకోకుండా చెబితే. మరికొంతమంది చెప్పాలనుకునేవి కూడా చెప్పలేరు. ఇలాంటివారిని ఇంట్రోవర్ట్స అంటారు. అయితే, వీరిలో కూడా కొన్ని హిడెన్ టాలెంట్స్ ఉంటాయి. అవేంటో తెలుసుకోండి.**

# తక్కువ మాట్లాడేవారు ఈ విషయాల్లో గ్రేట్

**సెల్ఫ్ అవేర్..**

- తక్కువగా మాట్లాడే వారు వారి గురించి వారి పాజిటీవ్ అంశాల గురించి బాగా తెలిసి ఉంటుంది. దీంతో ఏ విషయంలోనైనా మంచి నిర్ణయాలు తీసుకుంటారు. ఆ పనులు చక్కగా పూర్తి చేస్తారు.

**క్రియేటివిటీ..**

- వేరేవారికంటే తక్కువగా మాట్లాడేవారు క్రియేటివిటీగా ఉంటారు. వారి లోన్లీనెస్, ఇమాజినేషన్, క్రియేటివిటినీ మరింత డెవలప్ అయ్యేలా చేస్తుంది. దీంతో మిగతావారికంటే చాలా క్రియేటివిటీగా ఉంటారు.

**సరిగ్గా మాట్లాడడం..**

- అదే విధంగా, తక్కువగా మాట్లాడేవారు.. మాట్లాడే కొన్ని విషయాలైనా సరిగ్గా ఆలోచించి మాట్లాడతారు. ఈ మాటలు మరింత పవర్‌ఫుల్‌గా ఉంటాయి. పాయింట్ టూ పాయింట్ మాట్లాడతారు.

**ఎక్కువగా వినడం..**


- తక్కువగా మాట్లాడేవారిని మనం గమనిస్తే ఎక్కువగా వింటారు. ఏదైనా విషయం చెప్పాలనుకుంటే వీరికి చెప్పొచ్చు. వీరు పూర్తి వివరాలన్నీ తెలుసుకుని అర్థం చేసుకుంటారు. ఆ తర్వాతే స్పందిస్తారు.

**వీటితో పాటు..**

- తక్కువగా మాట్లాడేవారికి ఓపిక ఎక్కువగా ఉంటుంది. ఎలాంటి తప్పులు జరగకముందే వాటిని గుర్తించి సరిచేస్తారు. వారు ఇతరులతో కనెక్ట్ అవ్వరు. అయితే మాత్రం చాలా బాగా కనెక్ట్ అవుతారు.



# 3 నెలలు ఇలా చేస్తే పొట్ట మాయం



**ఇప్పుడు ఆడ మగ తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఊబకాయం. పొట్ట చుట్టూ కొవ్వు చేరి బాన కడుపుతో బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్న వారు బోలెడు మంది ఉన్నారు. ముఖ్యంగా మహిళల్లో కూడా ఈ పొట్ట సమస్య ఎక్కువగా ఉంటుంది.**

**మహిళల్లో పొట్ట సమస్య**

శారీరక శ్రమ లేకపోవడం, ఆఫీసుల్లోనూ, ప్రయాణాలలోనూ గంటల తరబడి కూర్చొని ప్రయాణం చేయడం సరిగ్గా నిద్రపోకపోవడం, అనవసరపు టెన్షన్లు, ఆహారంలో ఎక్కువ మొత్తంలో కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల ఈ పొట్ట సమస్యను మహిళలు ఎదుర్కొంటున్నారు. మహిళల్లో ఈ పొట్ట తగ్గాలంటే ఏం చేయాలి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

పొట్ట తగ్గాలంటే మహిళలు చెయ్యాల్సింది ఇదే మహిళల్లో పొట్ట తగ్గాలంటే ముందు లైఫ్ స్టైల్ చేంజ్ చేసుకోవాలి. ప్రతిరోజు కనీసం ఒక అరగంట పాటు అయినా శారీరక శ్రమ ఉండాలి. ప్రతిరోజు వ్యాయామం చేయడానికి సమయం కేటాయించుకోగలగాలి. కచ్చితంగా ప్రతిరోజు 8 గంటల పాటు నిద్రపోవాలి. వారంలో మూడు రోజులపాటు ఏరోబిక్ ఎక్సర్సైజులు, మిగతా రెండు రోజులు బరువులు ఎత్తే, శక్తినిచ్చే శారీరక వ్యాయామాలు చేయాలి. ఆహారంలో ఇవి తినకండి.. పొట్ట పెరుగుతుంది శారీరక వ్యాయామంతో పొట్ట చుట్టూ పేర్కొన్న కొవ్వు చాలా వరకు తగ్గుతుంది. ప్రతిరోజు సమయానుకూలంగా నిద్రపోతే శరీరంలోని మెటబాలిజం పెరుగుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా ఆహారం విషయానికి వస్తే స్వీట్లు, కేకులు, చక్కెర, బెల్లంతో తయారు చేసిన పదార్థాలు తీసుకోకూడదు. పిండి పదార్థాలు ఎక్కువగా ఉండే పాలిష్ చేసిన బియ్యం, అటుకులు వంటి వాటిని ఆహారంలో తీసుకోవడం తగ్గించాలి.

ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలి.. పొట్ట తగ్గుతుంది తీసుకునే ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. అన్నం తక్కువ క్వాంటిటీలో తినాలి. దాని బదులు పప్పులు, తృణధాన్యాలు, సలాడ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఆహారం తీసుకోవడానికి ఒక పూట తృణధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని మరొక పూట పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే పొట్ట బాగా తగ్గుతుంది.

మూడు నెలలు చేస్తే బెస్ట్ రిజల్ట్స్ మూడు నెలల పాటు ఈ విధానాన్ని పాటిస్తే మీ లైఫ్ స్టైల్ ను ఈ విధంగా చేంజ్ చేసుకుంటే పొట్ట చుట్టూ పేరుకు పోయిన కొవ్వు తగ్గడం మాత్రమే కాకుండా మీ ఆరోగ్యం కూడా బాగా ఉంటుంది శరీరకంగా మీ ఉత్సాహం పెరుగుతుంది.





# ప్రభాస్ కథ మెచ్చారు


మరో కొత్త కాంబినేషన్‌లో సినిమాకు అడుగులు పడుతున్నాయి. ప్రభాస్ కథానాయకుడిగా... ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ప్రశాంత్ వర్మ చెప్పిన కథకి ప్రభాస్ పచ్చజెండా ఊపడంతో ఈ కలయికలో సినిమాని హోంబలే ఫిలింస్ సంస్థ నిర్మించేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ప్రభాస్ చేతిలో చాలా సినిమాలున్నాయి. 'రాజా సాబ్' చివరి దశకు చేరుకున్నప్పటికీ, ఆ తర్వాత ఇంకా నాలుగు సినిమాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రశాంత్ వర్మ కూడా ఇప్పటికే రెండు సినిమాల్ని ప్రకటించారు. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా ఓ సినిమా, 'జై హనుమాన్' మరో చిత్రం. ఈ రెండింటి తర్వాత ప్రభాస్‌తో సినిమా ఉంటుంది. ఆయన మార్క్ ఫాంటసీ అంశాలతోనే ఆ సినిమా ఉంటుందని

తెలుగు వారిని నేను అవమానించలేదు..

## తన వ్యాఖ్యలపై కస్తూరి క్లారిటీ

తాను తెలుగు వారిని అవమానించలేదని నటి కస్తూరి స్పష్టం చేశారు. తమిళనాడులో ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అక్కడ స్థిరపడిన తెలుగు వారిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వైరలైన విషయం తెలిసిందే. ఆ కామెంట్స్‌పై విమర్శలు ఎదురుకావడంతో క్లారిటీ ఇస్తూ ఆమె పోస్ట్‌లు పెట్టారు.'తెలుగు నా మెట్టినిల్లు. తెలుగు వారంతా నా కుటుంబం. ఇది తెలియనివారు నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు. తెలుగు వారు ఎంతోమంది నాపై ప్రేమాభిమానాలు చూపిస్తున్నారు. తమిళ మీడియాలో నా కామెంట్స్‌ను వక్రీకరిస్తూ వస్తోన్న వార్తలను తెలుగు ప్రజలు నమ్మొద్దని కోరుతున్నా. డీఎంకే పార్టీ నా కామెంట్స్‌ను వక్రీకరిస్తోంది. ఇలా నాపై నెగెటివిటీ తీసుకొచ్చి నన్ను బెదిరించే ప్రయత్నం చేస్తోంది. నేను తెలుగు వారికి వ్యతిరేకంగా మాట్లాడానంటూ విష ప్రచారం చేస్తోంది' అని కస్తూరి తన పోస్ట్‌లలో పేర్కొన్నారు. తాజాగా ఓ రాజకీయ ప్రసంగంలో కస్తూరి మాట్లాడుతూ.. 300 ఏళ్ల క్రితం అంతఃపురంలో మహిళలకు సేవ చేసేందుకు తెలుగు వారు తమిళనాడుకు వచ్చారని ఆమె కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలు అటు తమిళనాట, ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర దుమారం రేపుతున్నాయి.





## నటుడు విజయ్ దేవరకొండకు గాయం

యువ నటుడు విజయ్ దేవరకొండ గాయపడ్డారు. కొత్త సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఆయనకు స్వల్ప గాయమైంది. వెంటనే చిత్ర బృందం ఆయన్ను ఓ ఆస్పత్రికి తరలించింది. ఫిజియో థెరపీ పూర్తయిన తర్వాత విజయ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నటిస్తున్నారు విజయ్. #VD12 వర్కింగ్ టైటిల్. ఈ సినిమా షూటింగ్‌లోనే గాయపడ్డారు. కేరళలో ఇటీవలే షెడ్యూల్ చిత్రీకరణ పూర్తికాగా ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమాలో విజయ్.. పోలీసు అధికారిగా నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 28న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో, రవికిరణ్ కోలా డైరెక్షన్‌లోనూ విజయ్ హీరోగా సినిమాలు తెరకెక్కనున్నాయి.

# వేడుకగా నార్నె నితిన్ నిశ్చితార్థం

యువ కథానాయకుడు, ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ త్వరలోనే ఏడడుగులు వేయనున్నారు. ఆయన వివాహ నిశ్చితార్థం ఆదివారం హైదరాబాద్‌లో శివానీతో జరిగింది. ఈ వేడుకకి ఎన్టీఆర్, లక్ష్మీప్రణతి దంపతులు, తనయులు అభయ్‌రామ్, భార్గవ్‌రామ్‌తోపాటు, కల్యాణ్‌రామ్, వెంకటేశ్ తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరై కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు చెప్పారు. 'మ్యాడ్' సినిమాతో పరిచయమైన నితిన్.. ఇటీవల విడుదలైన 'ఆయ్'తో మరో విజయాన్ని అందుకున్నారు.





# యాక్షన్‌లో తిరుగులేని ఏజెంట్ హనీ

కొద్దిరోజుల్లో 'సిటాడెల్:హనీ బన్నీ'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సన్నద్ధమవుతోంది అందాల తార సమంత. ఆమె, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ ఇది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను రాజ్ అండ్ డీకే రూపొందిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్, పోస్టర్లు సిరీస్‌పై అంచనాలను పెంచాయి. విడుదల సమయం దగ్గర పడుతున్న వేళ.. తాజాగా మరో కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది సిరీస్ బృందం. 'ధైర్యంలో.. యాక్షన్‌లో తిరుగులేని ఏజెంట్ హనీ'' అనే వ్యాఖ్యను జోడించింది. ఈ పోస్టర్‌లో తన కుమార్తెను రక్షించడం కోసం రంగంలోకి దిగిన స్పై ఏజెంట్‌గా కనిపిస్తూ సినీప్రియులను ఆకట్టుకుంటోంది సమంత. ఇందులో హనీ పాత్రలో కనిపించనుందామె. కేకే మేనన్, సిమ్రన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ వెబ్‌సిరీస్ ఈ నెల 7న విడుదల కానుంది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657